



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 29-07-2025 | సంపుటి : 07 | సంచిక : 79 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## ఏపీలో పెట్టుబడులు పెట్టండి

### సింగపూర్ బిజినెస్ ఫోరమ్‌లో చంద్రబాబు, లోకేష్

సింగపూర్, జులై, 28: ఏపీలో పెట్టుబడులు పెట్టండని ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరమ్‌లో పిలుపునిచ్చారు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్. సింగపూర్ తో ఏపీకి మూడు దశాబ్దాల అనుబంధం ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు. సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బృందం.. ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని ప్రసంగించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని, సింగపూర్ ప్రభుత్వంతో 3 దశాబ్దాలుగా కలిసి పనిచేస్తున్నామని చంద్రబాబు అన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఏపీ ప్రథమ స్థానంలో ఉందని చంద్రబాబు తెలిపారు. అమరావతి రూపకల్పన కోసం 2014లో సింగపూర్‌లో పర్యటించానని ఈ సందర్భంగా చంద్రబాబు ఫోరమ్ కు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేష్ రెండు రోజులుగా సింగపూర్ దేశంలో పర్యటిస్తున్నారు. ఈ రెండు రోజుల్లో అనేక కార్యక్రమాల్లో వీరిరువురూ పాల్గొన్నారు. సింగపూర్‌లోని పలు ప్రాజెక్టులను సందర్శించారు. ఇవాళ ఏపీ - సింగపూర్ బిజినెస్ ఫోరమ్ రోడ్ షో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్ ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. విశాఖలో నిర్వహించబోతున్న పెట్టుబడుల సదస్సుకు సన్నాహక సమావేశంగా సింగపూర్ లో ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం రోడ్ షో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నవంబరులో విశాఖ వేదికగా పెట్టుబడుల సదస్సు నిర్వహించనున్నారు. ఆటోమొబైల్ ఇంకా అనేక రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు.


## బనకచర్లపై కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ, జులై 28: బనకచర్ల ప్రాజక్ట్ పనులు ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజక్ట్ సాంకేతిక - ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియను అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల శక్తి మంత్రి రాజ్ భూషణ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి.. సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్ట్‌ను రూ. 81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అఖిల పక్షం ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలువురు మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన దస్త్రాన్ని కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది. ఆ తర్వాత.. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలు ఈ సందర్భంగా వీరు చర్చించారు. అనంతరం ఈ అంశంపై నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలంటూ ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల భారీ నీటి పారుదల శాఖ మంత్రులతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## విజయవాడలో నీటి సరఫరాని ప్రధాని మోదీ అభినందించారు: మంత్రి నారాయణ

సీఎం చంద్రబాబు పర్యవేక్షణతో విజయవాడలో ఇటీవలే స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు దక్కించుకుందని మంత్రి నారాయణ తెలిపారు. సీఎం చంద్రబాబు కృషితో రాష్ట్రానికి అమృత్ పథకం ద్వారా కేంద్రం నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. అమృత్ పథకం ద్వారా ఏపీవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో వచ్చే మూడేళ్లలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. అమరావతి: విజయవాడలో నీటి సరఫరాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించడం గర్వకారణమని మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. నిన్నటి(ఆదివారం) మన్ కీ బాత్‌లో విజయవాడలో నీటి సరఫరాపై ప్రధాని ప్రశంసలు కురిపించారని చెప్పుకొచ్చారు. విజయవాడలో నీటి నిర్వహణ చాలా బాగుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర, ఇతర అధికారులు, సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఇవాళ(సోమవారం) మంత్రి నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వ అభివృద్ధికి నిదర్శనమని మంత్రి నారాయణ ఉద్ఘాటించారు. సీఎం చంద్రబాబు పర్యవేక్షణతో విజయవాడలో ఇటీవలే స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు దక్కించుకుందని తెలిపారు. విజయవాడ కార్పొరేషన్‌లో ప్రతి రోజూ 16 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని వెల్లడించారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండప్రాంతాల్లో సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తున్నామని వివరించారు. సీఎం చంద్రబాబు కృషితో రాష్ట్రానికి అమృత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని గుర్తుచేశారు.


## సమస్యల పరిష్కారంలోజాప్యం చేస్తే చర్యలు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 28-జిల్లాలోని అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా బాధితుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలు జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం పిజిఆర్ఎస్ సమావేశానికి వస్తుంటారని అధికారులు వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ వారికి అర్థమయ్యే విధంగా స్పష్టంగా ఇవ్వాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువు లోపల పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యలపై 233 దరఖాస్తులను అర్జీదారులు కలెక్టర్



కు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ పై లోక్‌సభలో సోమవారంనాడు వాడివేడి చర్చ జరుగుతుండగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. చర్చ సందర్భంగా భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం లేదని ఎస్ జైశంకర్ చెప్పడంతో విపక్ష సభ్యులు జైశంకర్‌పై ప్రశ్నలు కురిపించారు. దీంతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా (ఎతిబి రాష్ట్రజీష్ట్ర) ఫైర్ అయ్యారు. 'మరో 20 ఏళ్లు మీరు అక్కడే కూర్చుండిపోతారు' అంటూ విపక్షాలపై విసుర్లు విసిరారు. 'విపక్షాల తీరుపై నేను అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాను. వాళ్లకు భారత విదేశాంగ మంత్రిపై నమ్మకం లేదు. కానీ కొన్ని ఇతర దేశాలపై విశ్వాసం కనబరుస్తుటారు. విదేశం (ఫారెన్) అంటే ఆ పార్టీకి ఉన్న మక్కువ ఏమిటో నేను అర్థం చేసుకోగలను. దాని అర్థం ఆపార్టీ వ్యవహారాలను ఇక్కడ రుద్దమని కాదు. ఆ కారణంగానే వాళ్లు అక్కడ (విపక్ష బెంచీల్లో) ఉండిపోయారు. మరో 20 ఏళ్లు కూడా అక్కడే ఉండిపోతారు' అని అమిత్‌షా నిప్పులు చెరిగారు. ప్రసంగానికి అడుగడుగునా అడ్డు.. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్‌పై జరిగిన చర్చలో జైశంకర్ మాట్లాడుతుండగా విపక్ష సభ్యులు పలుమార్లు అంతరాయం కలిగించారు. దీంతో అమిత్‌షా జోక్యం చేసుకుంటూ 'మీ సొంత విదేశాంగ మంత్రినే మీరు నమ్మరా?' అంటూ విపక్షాలపై మండిపడ్డారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం లేదని, ఏప్రిల్ 22 (పహల్గాం ఘటన జరిగిన రోజు) నుంచి జూన్ 27 వరకూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని జైశంకర్ చర్చ సందర్భంగా సభకు వివరణ ఇచ్చారు.

## ఏపీలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల


అమరావతి, జులై, 28: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3 ఎంపీటీసీ 2 జడ్పీటీసీ, 2 సర్పంచ్ స్థానాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో రామకుప్పం, కారంపూడి, విడవలూరు ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇక, ఇదే క్రమంలో కొండపూడి, కడియపులంక గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు కూడా జరుగుతాయి. ఇక,




జూలై 30 నుండి ఆగస్టు 1 వరకూ నామినేషన్ల స్వీకరణకు అనుమతిస్తారు. ఆగస్టు 12న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనుండగా, ఆగస్టు 14న ఏపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వస్తాయి. ఆగస్టు 10న సర్పంచ్ ఎన్నికలు .. ఉండగా, అదే రోజున ఫలితాలు విడుదల చేస్తారు.

## పహల్గాం ఉగ్రవాదిని మట్టుబెట్టాం.. బీజేపీ ఎంపీ జే పాండా

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న యాంటీ టెర్రర్ అపరేషన్ లో పహల్గాం ఉగ్రదాడితో ప్రమేయం ఉన్న ఒక టెర్రరిస్టును బలగాలు మట్టుబెట్టినట్టు బీజేపీ ఎంపీ బైజయంత్ జే పాండా లోక్‌సభకు తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌పై సోమవారంనాడు ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొంటూ, ఆపరేషన్ సింధూర్‌పై ఒకవైపు సభలో చర్చజరుగుతుండగా మరోవైపు ఆపరేషన్ మమదేవ్ నడుస్తోందని, ఈ ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. వీరిలో ఒక ఉగ్రవాదికి పహల్గాం ఉగ్రదాడితో ప్రమేయం ఉందని వివరించారు. ఆపరేషన్ సింధూర్ హైలైట్స్‌ను జే పాండా వివరిస్తూ, భారత వాయిసేన పాక్‌లోని 11 వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుందని, 20 శాతం పాక్ వాయిసేన ఆస్తులను ధ్వంసం చేసిందని చెప్పారు. 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు చెప్పారు. ఈ దాడులను పాకిస్థాన్ తిప్పికొట్టడంలో విఫలమైందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాక్ వైఫల్యాన్ని విపక్షాలు గుర్తించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.



# సంపాదకీయం

ఆదివారం 27-07-2025

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అపహాస్యం

వారం రోజులుగా పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. సమస్యలపై చర్చించాలన్న ఆసక్తి అధికార విపక్షాలకు లేకుండా పోయింది. సభ ప్రారంభం కాగానే గోడవ చేయడం విపక్షాల వంతు అయితే వాయిదా వేయడం స్పీకర్ విధిగా మారింది. సోమవారం ఉద్యం కూడా ఇదే తరహాలో మధ్యాహ్నానికి సభ వాయిదా పడింది. దీనిబదులు సమస్యలు ముందుకు వేసుకుని ఏరోజు ఏది చర్చించాలన్నది నిర్ణయం తీసుకోవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేందుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలి. కానీ ప్రతిష్టంభనతో సాధించేదేమీ లేదని ఇరు పక్షాలు కూడా గుర్తించాలి. ఇప్పుడు వర్షాకాల సమావేశాలు సైతం ఒక్కటంటే ఒక్క సమస్యపై చర్చించడం లేదు. ఈనెల 21న పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. నేటికీ ఒక్క సమస్యపైనా చర్చలేదు. చర్చకు సిద్ధమని అధికార పక్షం చెబుతున్నా.. విపక్షాలకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. భారతదేశం, ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. ఎందుకిలా అన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళనలతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. వ్యక్తిస్వామ్యం, నిరంకుశత్వం ప్రబలిపోతోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యల పై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది మరచిపోయారు. సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగుతోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే చట్టసభల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయ ఎజెండాతో పనిచేయడం వల్లనే ఇలా జరుగుతోంది. ఇలా ఒక్క సమస్యపైనా చర్చించకుండా కాలం గడిపేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, వరదలు, నిరుద్యోగం లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వా లని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలు ప్రవేశ పెడుతున్న వాయిదా తీర్మానాలను సభాపతులు బుట్టదాఖలు చేస్తున్నారు. కనీసం సభావ్యవహారాల కమిటీ సమావేశాల్లో కూడా కీలక అంశాలపై చర్చకు సమయాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం మనస్ఫూర్తిగా ముందుకు రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని ప్రధాని మోడీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించడం ఆనవాయితీగా మారింది. తొలిరోజు ప్రధాని మోడీ కూడా సభ సజావుగా సాగాలని, ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఉందని అంటున్నారు. అయితే పార్లమెంట్ సమావేశమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడడం లేదు. నిజంగా ఎందుకు ఇలా చేస్తున్నారో బిజెపి అగ్రనేతలు చెప్పాలి. ఎందరో కొత్త సభ్యులు పార్లమెంట్ గడప తొక్కారు. వారికి రూల్స్ కూడా తెలియకుండానే సమావేశాలు వాయిదా పడుతున్నాయి. ఈ తరహా జరుగుతున్న సమావేశాలతో ప్రజలకు ఏం సమాధానం చెబుతారో చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎక్కడుందన్న అనుమానం కలుగుతుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై వారం రోజులైనప్పటికీ ఒక్కరోజు కూడా పార్లమెంట్ సరిగ్గా సాగలేదు. వాయిదా తీర్మానాలతో విపక్షాలు ఆందోళన చేస్తున్నారు. స్పీకర్లు వాయిదాలు వేస్తున్నాయి. తాజాగా పార్లమెంట్ వ్యవహారాల పరిస్థితి ఇది. పార్లమెంట్‌ను నడిపించేందుకు రాజనీతిజ్ఞత అవసరం. మనం ఉన్నదే ప్రజల కోసం అన్న కోణంలో అధికార పక్షం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి..సమస్యలపై చర్చించడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వాలి. ఇలా నిరంకుశంగా వెళితే ఎంతటి వారికైనా ప్రజలు శిక్ష వేయక మానరు. మళ్లీ మాదే అధికారం అన్న అహంకార ధోరణి పనికిరాదు. పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ అదేరీతిలో ప్రవర్తించి ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయింది. బిజెపి కూడా ఇదే ధోరణితో సాగితే ప్రజలు కూడా చాపచుట్టినట్లు చుట్టి బంగాళాఖాతంలో విసరేస్తారని గుర్తించాలి. చట్టసభల్లో ప్రజా సమస్యలను చర్చించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలి.

# నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ

### -నేడు మన తెలంగాణ ముద్దు బిడ్డ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

తెలుగు చలన చిత్ర సీమలో డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం సహజత్వానికి ప్రయోగాలకు పుట్టినిల్లు. అంతకు మునుపు ఎక్కువగా వాడని పదాలను సాహితీ స్రవంతిలోకి తీసుకు వచ్చి, వాటితో సాహిత్యానికి ఎంతో వన్నె తెచ్చారు సినారె. దొరసాని, నెరజాణ వంటి పదాలు అప్పట్లో తెలుగు సినీ సాహిత్యంలో చాలా అరుదుగా ఉపయోగించే వారు. నారాయణ రెడ్డి అటువంటి పదాలను తన సాహిత్యంలో పొందు పరచి తెలుగు భాష అందాన్ని పెంచారు. సినారెగా సుప్రసిద్ధుడైన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డిది ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని హనుమాజీపేట. బుచ్చమ్మ, మల్లారెడ్డి తల్లిదండ్రులు. 1931 జూలై 29న జన్మించారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంతో పాటు సిరిసిల్ల,కరీంనగర్‌లో పూర్తి చేశారు. ఉన్నత విద్యాభ్యాసానికి హైదరాబాద్ వెళ్లారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పూర్తి చేసి అక్కడే అధ్యాపకుడిగా పనిచేశారు. కళాశాల విద్యార్థిగా ఉన్నపుడే శోభ పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. పసి వయసులో విన్న హరికథలు, జానపదాలు, జంగం కథల స్ఫూర్తితో ఉన్నత స్థాయి సాహితీవేత్తగా ప్రఖ్యాతి చెందారు. 1953లో నవ్వనిపువ్వుతో ప్రారంభమైన సినారె సాహిత్య ప్రస్థానం అలుపెరగక సాగిపోయింది. పద్య కవితలు, గేయకావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, సంగీత నృత్య రూపకాలు, ముక్తకాలు, బుర్ర కథలు, గజళ్లు, వ్యాసాలు విమర్శలు, అనువాదాలు వంటి అనేక సాహితీ ప్రక్రియల్లో అనితర సాధ్యమైన ప్రతిభను చాటుకున్నారు.నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మట్టి మనిషి ఆకాశం, విశ్వంభర, మంటలు మానవుడు, మధ్య తరగతి మందహాసం, నడక నా తల్లి, తెలుగు గజళ్లు, భూమిక, ముఖాముఖి, ఆరోహణ, అక్షర గవాక్షాలు, ఇంటి పేరు చైతన్యం తదితర రచనలు చేశారు. సినారె రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువదించబడింది. దీంతో పాటు ఆయన గ్రంథాలు ఇంగ్లిష్, ఫ్రెంచ్ సంస్కృతం, మలయాళం, హిందీ, ఉర్దూ కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో సందర్శించారు. అంతర్జాతీయ కవి సమ్మేళనాల్లో భారతీయ ప్రతినిధిగా హాజరై తెలుగు సాహిత్య వైభవాన్ని విశ్వయవనికపై చాటారు. ఆధునిక ఆంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు పేరిట సినారె పరిశోధన ఆయను పీహెచ్‌డీ ప్రామాణిక విమర్శన గ్రంథంగా మిగిలింది.అత్యున్నత పురస్కారాలు..కేంద్ర సాహిత్య అకాడమీ, సోవియట్ ల్యాండ్ నెహ్రూ పురస్కారంతో పాటు విశ్వంభర దీర్ఘ కావ్యానికి 1988లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కారం వరించింది.భారతీయ భాషా పరిషత్, రాజలక్ష్మి, అసాన్, ఉమ్మడి రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాలు సలహాదారునిగా, సాంస్కృతిక మండలి, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా వ్యవహరించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట సాహిత్య పురస్కారం అందుకున్నారు. డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం స్వీకరించారు. రాజ్యసభ సభ్యులుగా ఉన్నతమైన బాధ్యతలను నిర్వహించారు. భారత ప్రభుత్వం సినారె సేవలను గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలిచ్చింది. పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో గౌరవించాయి. సినిమా పాటలు కైకట్టి..వందలాది సినిమాలకు వేల సంఖ్యలో సినీ గీతాలు రాశారు. స్వర్గీయ ఎన్టీఆర్ కథానాయకుడిగా విడుదలైన గులేబకావళి కథ సినిమాలో నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేసిన సినారె ఆపైన సుమారు మూడు వేలకు పైగా పాటలు రచించి సినిమా ప్రేక్షకులకు సైతం చేరువయ్యారు. చిలిపి కనుల తీయని చెలికాడా.. అనగనగా ఒక రాజు అనగనగా ఒక రాణి, నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవొద్దు, జాతిని నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు. అమ్మను మించి దైవం ఉన్నదా ఆత్మను మించి అద్దమున్నదా.. కంటేనే అమ్మ అని అంటే ఎలా.. ఓ ముత్యాల కొమ్మా...ఓ రాములమ్మా.. తదితర తెలుగు సినిమా పాటలు సినారె ప్రతిభకు తార్కాణాలు. సినిమా పాటల్లో సైతం సాహిత్య విలువలకు పట్టం కట్టి తెలుగు సినీ సాహిత్యంపై చెరగని ముద్ర వేశారు. 2017 జూన్ 12 న హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్ను మూశారు.



## పర్యావరణ ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత

కమాన్ పూర్ జూలై 28, (న్యూస్ పల్స్)పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి అన్నారు. సోమవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రామగిరి ఖిల్లా పై విత్తనపు బంతులు వేయడం జరిగిందివర్యావరణాన్ని,సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుంది అందులో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో రామగిరి ఖిల్లా గుట్ట ప్రాంతంలో దాదాపు 500 విత్తనము బంతులను విసిరివేయడం జరిగింది. విత్తనము బంతుల్లో అల్ల నేరడి, సీతాఫలం,వేప,నిమ్మ వంటి పండ్లు మరియు కూరగాయల విత్తనాలతో కూడిన మట్టితో బంతులు తయారు చేయడం జరిగింది.అనంతరం లయన్స్ క్లబ్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,మేకల మారుతి మాట్లాడుతూ శ్రావణ మాసంలో రామగిరి ఖిల్లా వీక్షణకు వచ్చేవారు కూడా విత్తనపు బంతులు వేయాలని కోరుతున్నాము అలా చేయడం వల్ల మూగ జీవాలకు ఆహారం దొరుకుతుంది. విశ్వంలో జీవరాశుల మనుగడకు మూలాధారం అయిన భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాలను ప్రకృతే ఈ విశ్వానికి అందించిందని వారిని విధ్వంసం చేయడం వల్ల మానవాళి పలు విపత్తులకు గురవుతుంది. మానవుడు ఉన్నన్ని రోజులు ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి తర్వాత తరానికి అందించాలి ప్రకృతి వనరులు తరతరాల వారసత్వ సంపద కాబట్టి వాటిని భావి తరాల కోసం రక్షించాలి. భారతదేశములో ప్రకృతిని దేవతగా ఆరాధించే సంస్కృతి వుందన్న చారిత్రిక సత్యాన్ని మరువకూడదు. విచక్షణ రహితంగా అటవీ సంపదను విధ్వంసం చేయటం వల్ల ప్రకృతి విపత్తులు అకాల వర్షాలు వరదలు వచ్చి అపారమైన ఆస్తినష్టం, ప్రాణ నష్టం సంభవిస్తుంది ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కొరకు మనందరం ఐక్యమై ఉద్యమించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. పర్యావరణ ప్రకృతి పరిరక్షణకు '3ఆర్' పద్ధతిలో తగ్గించడం (రెడ్యూ స్ ) తిరిగి వాడటం (రీయూజ్) పునరుద్ధరణ (రీసైక్లింగ్)వంటి పద్దతులు మనిషి జీవితములో బాగం కావాలి అలాగే అడవుల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలి. ప్రకృతి పర్యావరణ హితకరమైన చర్యలు చేపట్టాలి.ప్రకృతి రక్షణే మానవాళి రక్షణ అన్నది ఒక నినాదం కాకుండా ప్రజల జీవన విధానం కావాలి. భావితరానికి స్వచ్ఛమైన ప్రకృతిని బహుమతిగా ఇద్దాం. ప్రకృతి రక్షణ మనందరి కోసం భావితరాల కోసం మనిషి మనుగడ కోసం. స్వచ్ఛభారత్ నిర్మాణానికి పునరంకితమౌదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మొల్మూరి శ్రీనివాస్,సభ్యులు తీగల శ్రీధర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేదల కళ్ళల్లో ఆనందం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- 10 ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లు, రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను వంచించింది**

**- 18 గంటలు ప్రజల కోసమే పనిచేస్తున్నా**

**పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి ,పేదల కళ్ళల్లో ఆనందం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింత కుంట విజయరామణా రావు అన్నారు. సోమవారంమండలంలోని గౌరెడ్డిపేట, ముత్తారం గ్రామాల్లో రూ.90 లక్షల నిధులతో పలు డ్రైనేజిలు, సిసి రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే ముత్తారం గ్రామంలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభోత్సవం చేసి గౌరెడ్డిపేట, ముత్తారం గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రుణ సదుపాయం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ. 10 లక్షలకు పెంపు, కటింగులు లేకుండా వడ్ల కొనుగోల్లు, సన్న వడ్లకు రూ. 500ల చొప్పున బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. సంవత్సరంన్నర కాలంలోనే ఇన్ని సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

## బీసీల ఓట్ల కోసమే బీజేపీ, కాంగ్రెస్ డ్రామా : శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ : బీసీల ఓట్ల కోసమే కాంగ్రెస్, బీజేపీలు డ్రామా ఆడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఇవాళ మీడియాతో మాట్లాడారు.దేశం మొత్తం ఓబీసీ వర్గాల వెనకబాటు తనంపై చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా కులగణనకు ఒప్పుకుంది. చట్ట సభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్లు వస్తాయనే వాతావరణం ఏర్పడింది. చట్టసభల్లో రిజర్వేషన్లు దేవుడెరుగు ఇపుడు రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావడం గగనమవుతోంది. గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్‌కు మోక్షం లభించలేదు. ఢిల్లీలో రాష్ట్రపతి దగ్గర బుక్ బిల్లులు ఏమయ్యాయో తెలియదు అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.ఈ రోజు కేబినెట్ సమావేశం ఉంది ఏం తెలుస్తారు? బీసీల పట్ల కాంగ్రెస్, బీజేపీలది వగల ప్రేమే అని తేలిపోయింది. బీసీ ఓట్ల కోసమే ఆ రెండు పార్టీలు డ్రామా ఆడుతున్నాయి. తొమ్మిదో షెడ్యూల్లో పెడితే తప్ప బీసీలకు రిజర్వేషన్లు పెరుగవు. బీజేపీ ముస్లిం రిజర్వేషన్లను సాకుగా చూపి బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకుంటోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం లేదా ? ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ముస్లింలు లేరా ? రిజర్వేషన్లు రాష్ట్రం పరిధిలో లేని అంశమనీ.. ఎవరైనా ఇక్కడ పెంచితే జైలుకు వెళ్లడం ఖాయమని రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కాదని తెలిసి రేవంత్ రెడ్డి రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌ను గవర్నర్ దగ్గరకు ఎందుకు పంపారు బీసీ బిల్లుల ఆమోదానికి కేంద్రం దగ్గర రేవంత్ రెడ్డి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. బీసీల మీద సీఎంది కపట ప్రేమ అని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.కాంగ్రెస్ బీసీ నాయకులు 42 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం గట్టిగా కృషి చేయాలి. బీసీలకు ఏదీ చేయాలన్నా బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సీఎం, మంత్రులు బీసీ బిల్లులు ఆమోదించుకోవడానికి ఢిల్లీ వెళ్లి పాస్ అయ్యాకే హైదరాబాద్ తిరిగి రావాలి. కాంగ్రెస్, బీజేపీల చేతిలో మరోసారి మోసపోవడానికి బీసీలు సిద్ధంగా లేర. ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గరకు పంపగానే కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు .ఇపుడు ఏం సమాధానం చెబుతారు. బీసీలకు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపు కోసం ఎందుకు ఆర్డినెన్స్ తేలేదు..? ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళితే మేము వస్తాం. ఆ పని చేయడం లేదు అని శ్రీనివాస్ గౌడ్ దుయ్యబట్టారు.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి : మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



చందంపేట జూలై 28 : త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నుండి సుమారు 200 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికి రవీంద్రకుమార్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొండమల్లేపల్లి మండలంలోని చింతచెట్టు తండా, వద్యా తండా, జిత్యతండా, ఫుల్ సింగ్ తండాలకు చెందిన వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడం వంటి అంశాలతో విసుగుచెందిన వారంతా వివిధ పార్టీల నుండి బీఆర్ఎస్ పార్టీ చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, లింగారెడ్డి, దస్రూ నాయక్, తులసి రామ్ నాయక్, రాజు కృష్ణ పాల్గొన్నారు.

## ఉయ్యాలవాడ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల కళాశాలలో ఫుడ్ పాయిజన్

నాగర్ కర్నూల్ ,నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల కళాశాలలో ఆహారం వి టించి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి కావడం పట్ల బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి గురుకుల కళాశాల సిబ్బందిపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గతంలో ఎన్నో ఫుడ్ పాయిజన్లు అయినాయని, దాని తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఒక రోజు వెనుకబడిన సంక్షేమ గురుకుల హాస్టల్స్ మరియు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ను సందర్శించాలని రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టల్ లను సందర్శించి అక్కడ మెనూ ప్రకారంగా భోజనం పెడుతున్నారా లేదా అని విసిట్ చేసి అనంతరం వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని మెను మరియు మెనూతో పాటు బడ్జెట్ పెంచడం జరిగింది.

## నేడు నాగ పంచమి సందర్భంగా సూర్య దేవాలయంలో
# సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు..



విభారే న్యూస్ జూలై 28 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయంలో నేడు నాగ పంచమిసందర్భంగా శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషంగా పూజలు, అర్చనలు,సర్ప సూక్త విధానంగా పంచామృత అభిషేకాలు జరుగును.వివాహ సమస్యలు, భూ సమస్యలు, సంతాన సమస్యలు ఉన్నవారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన ద్వారా తమ సమస్యలను దూరం చేసుకోగలరు..పంచామృత అభిషేకం -200/-మాసపూజ-300/-నిత్యపూజ-3000/- సంప్రదించండి :-శ్రీధర్ శర్మ - 7995202082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు.. 8896123777 ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388...

## బస్సులు నడుపుటకు డ్రైవర్లు కావలెను...




విభారే న్యూస్ జూలై 28 కర్నూలు జిల్లా ప్రతినిధి..ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, కర్నూలు-1 డిపో లో బస్సులు నడుపుటకు ఆన్ కాల్ డ్రైవర్లుగా విధులు నిర్వహించడానికి అర్హులైన భారీ వాహనాలు నడుపు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి కనీసము రెండు సంవత్సరాల అనుభవము ఉన్న డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవలసినదిగా కోరడమైనది. వివరములకు, ఎస్.ఆర్.వలి, 9985181304,జి.వి.ఆంజనేయులు, 9949202923నిసంప్రదించగలరుఅని డిపో మేనేజర్ కే సుధారాణి తెలియజేశారు..

## శ్రావణ మాసం సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ ఉరుకుంద ఈరన్నస్వామి వారిని దర్శించుకున్న శ్రీ మతి బుట్టా రేణుక దంపతులు...



విభారే న్యూస్ జూలై 28 ఎమ్మిగనూరు...శ్రావణ మాసం పర్వదినం సందర్భంగా 27-07-2025 తేదీన ఉరుకుంద గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి వారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక, పార్టీ సీనియర్ నేత బుట్టా శివనీలకంఠతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చేనేత జిల్లా అధ్యక్షులు ఎం.కె. శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి కే. సునీల్ కుమార్, జిల్లా మేధావుల ఫోరం కార్యదర్శి అగ్రహారం నాగిరెడ్డి,పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు,పట్టణ యువజన విభాగం అధ్యక్షులు బోయ రాజు, పట్టణ మహిళా అధ్యక్షురాలు లతా రెడ్డి,25వ వార్డు ఇంచార్జ్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## నేడు కౌన్సిల్ సమావేశం
## కమిషనర్ బండి శేషన్న




విభారి న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 28---స్థానికమున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరగనున్న నేపథ్యంలో సోమవారం విలేకరుల సమావేశంలో కమిషనర్ బండి శేషన్న వెల్లడించారు . మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 11 గం ఛైర్పర్సన్ మాబున్నీసా అధ్యక్షత సమావేశం ప్రారంభ మవుతుందన్నారు.కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

# పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా పీ4
# :జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 28-జిల్లాలో పి4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించి పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం జరుగుతుందని జిల్లాలోని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పి4, లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్లోపలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పి4, కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇది నిరంతరం కొనసాగే కార్యక్రమమని ఈ కార్యక్రమాన్ని అధికారులందరూ సీరియస్ గా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు.నంద్యాల జిల్లాలో మొత్తం 42,937 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉండగా అందులో 41,613 కుటుంబాలు దత్తత తీసుకోవడం జరిగిందని ఇంకా 1,324 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. కావున జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి ప్రతి ఒక్క బంగారు కుటుంబానికి సాయం చేసి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంలో మన జిల్లా ఆరవ స్థానంలో ఉందని జిల్లాను మొదటి స్థానంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# బిజెపిని రాష్ట్రంలో బలోపేతం చేస్తా
## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 28-బిజెపిని రాష్ట్రంలో బలోపేతం చేస్తానని, రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్త ఇంటికెళ్లి తలుపు తట్టి యోగ క్షేమాలు తెలుసుకుంటానని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. నిన్న దేవుని కడప నుంచి ప్రారంభించానని రెండో రోజు సోమవారం నవనందుల గడ్డలో అడుగు పెట్టానని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నంద్యాల జిల్లాలో సోమవారం పర్యటన ఇలా కొనసాగింది. ఉదయం పార్టీ కార్యాలయంలో పాల్గొని జేష్ఠ కార్యకర్తలకు సత్కారం చేశారు. అనంతరం మొక్కలు నాటి, 100 ఏళ్ల చరిత్ర కలిగిన మారుతీ వ్యాయమ మండలిని సందర్శించారు. పర్యటనలో ఆయనకు కార్యకర్తలు ఉత్సాహంగా స్వాగతం పలికారు. అనంతరం నంద్యాలలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పర్యటించారు. స్థానిక పద్మావతి నగర్ నుంచి వై జంక్షన్ వరకు బీజేపీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సౌజన్య ఫంక్షన్ హాల్లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరవేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని, రాయలసీమను రతనాలసీమగా మార్చి ఈ ప్రాంతానికి నీళ్లు, ఉద్యోగాలు, ప్రాజెక్టులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు. రాయలసీమ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పార్టీ సత్తా చాటాలని సూచించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని, అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా అందరికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి ని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు. ఎమ్మెల్యే పార్థసారథి. పాటు జిల్లాలో ఉన్న అసెంబ్లీ కన్వీనర్లు మండల అధ్యక్షులు, బూతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ చమ్మార్ సోదరుల (మాదిగ)
# ఓవరాల్ డామినేషన్ పై దేశవ్యాప్త రాజకీయ కుట్ర!!



కాకినాడ జులై 28 ఎస్సీ రిజర్వేషన్ పేరుతో వందమందిలో కేవలం నలుగురికి లబ్ధి జరుగుతా ఉంది మిత్రులారా, ఈ రిజర్వేషన్ పేరుతో మనకు పడేసేది ఎంగిలి మెతుకులు మాత్రమే, ఈ ఎంగిలి మెతుకుల్లో ఎస్సీ వర్గీకరణ ముసుగులో వాటాల కోసం దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలు, నిరంతరం కొట్టుకు చచ్చే విధంగా, మోడీ, చంద్రబాబు రేవంత్ రెడ్డి కుట్రపన్నారు, దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి మిత్రులారా, ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చంద్రబాబు ఇచ్చిన హామీలను, పక్కదోవ పట్టించేందుకే, రాష్ట్రంలో వేరే ఏ సమస్య లేనట్టు ఎస్సీ వర్గీకరణను తెరపైకి తీసుకువచ్చారు, తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు, టార్గెట్ చేస్తూ తొక్కేస్తా ఉన్నాయి మిత్రులారా, దళితులందరికీ హోల్సేల్ మేనమామ, ముఖ్యంగా మాల సామాజిక వర్గానికి మేనమామ అయినటువంటి, జగన్మోహన్ రెడ్డి కనీసం ఈ విషయంపై నోరు మీద పోవడం, అత్యంత దారుణం, ఎస్సీ వర్గీకరణ పేరుతో, ఎంగిలి మెతుకుల్లో వాటాల కోసం ఎస్సీ కులాలన్నీ నిరంతరం కొట్టుకు చస్తూ, రాజ్యాధికారం వైపు కనీసం కన్నెత్తకుండా, చూసే విధంగా కుట్ర పన్నాయి మిత్రులారా ఈ రాజకీయ పార్టీ, నార్త్ ఇండియాలో రైతులు వ్యవసాయ చట్టాన్ని వెనక్కి తీసుకునేంత వరకు, ఏ విధంగా పోరాటం కొనసాగించారో అదే తరహాలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను, శాంతియుత నిరంతర పోరాటం తప్పదు, ఈ కార్యక్రమంలో కొప్పుల ప్రేమ్ బాబు, నెల్లి సూరిబాబు, తనికెళ్ళ నాని తదితరులు పాల్గొన్నారు, వినకోటి సూర్యప్రకాష్ , డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్

## 25.07.2025 నుండి 23.08.2025 వరకు సూర్య దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా గౌరీ శంకర స్వామికి విశేష పూజలు..



విభారే న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 28...25-07-2025 శుక్రవారం నుండి 23-08-2025 శనివారం వరకు పవిత్రమైన శ్రావణమాసం సందర్భంగా శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహాగౌరీ సమేత శ్రీ గౌరీ శంకర స్వామి వారలకు విశేష పూజలు జరుపబడును. శ్రావణమాసంలో వచ్చే శుక్రవారములు అమ్మవారికి అత్యంత ప్రీతి దాయకమైనవి అందువలన ఈ మాసంలో వచ్చే 5 శుక్రవారములు మహాగౌరీ అమ్మవారికి శ్రీ లక్ష్మి సహస్రనామార్చన, శివారాధనకు శ్రావణ సోమవారములు ప్రధానమైనవి. అందువలన 4 సోమవారములు శ్రీ గౌరీశంకర స్వామి వారికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకములు చేయబడును. ఈ శ్రావణమాసంలో చేసే అర్చన, అభిషేకములు విశేష ఫలితములు ఇవ్వగలవు. శ్రీ గౌరీ సమేత గౌరీశంకర స్వామి వారల అనుగ్రహము వలన సకల ఆయురారోగ్య ఐశ్వర్యములు లభించగలవు.శ్రీ పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహము సిద్ధించగలదు.పై రెండు పూజలకు 5 శుక్రవారములు అమ్మవారికి అర్చన 4సోమవారములుఈశ్వరాభిషేకములు కలిపి మాసమునకు,300/- చెల్లించిన భక్తులు గోత్రనామాదులతో పూజ అభిషేకము. జరుపబడును. సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ..8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు.. 8896123777ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదికకు " 86 ఫిర్యాదులు... జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 28-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 86 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి.

## పరిష్కారం కోసం నలుగురే వచ్చారు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 28--'ప్రజా సమస్యల పరి ష్కార వేదిక' కార్యక్రమంపై మున్సిపాల్టీ అధికారులు ప్రచారం కల్పించడంలో విఫలమయ్యారని దీని బట్టి తెలుస్తుంది. సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్న సమాచారం చాలామందికి తెలియకపోవడంతో స్పందన కరువైంది. నలుగురు మాత్రమే అర్జీలు తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన మున్సిపాల్టీ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాల్టీ లో 44వార్డు సచివాల యాలు ఉన్నాయి. వీటి పరిధిలోని ప్రజలకు సమాచారం చేరవేసినా చాలామంది సద్వినియోగం చేసుకునే వారు. కానీ సచివాలయ సిబ్బంది ప్రజలకు చేర వేయడం విఫలం అయ్యారని గుసగుసలు వినిపిస్తున్నాయి .

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190